క్లుప్తంగా

బ్యాలెట్ పద్ధతిలోనే ప్రజాస్వామ్యానికి మనుగడ


మేడా శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ఈవీఎంలతో ఎన్నికలు జరిగినన్నాళ్లు మోదీ, అమిత్ షాలను ఎవ్వరూ ఓడించలేరని, బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరిగితేనే ప్రజాస్వామ్యం బతికి బట్టకడుతుందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. అధికార పార్టీ చేతిలో ఎన్నికల సంఘం కీలుబొమ్మగా మారిపోయిందని, దానిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఈవీఎం ఓటింగ్ విధానాన్నిరద్దు చేసి, బ్యాలెట్ పద్ధతిని అమలు చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

కోళ్ల పెంపకం కేంద్రాల తనిఖీ

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని కోళ్ల పెంపక కేంద్రాలలో ఏవీయన్ ఇన్ఫ్లుయెంజా వైరస్ సోకకుండా కట్టడి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. జాంపేట ఏరియాలోని కోళ్ల పెంపకం, అమ్మకం కేంద్రాలను పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులతో సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరవలి, కానూరు గ్రామాల్లోని కోళ్లఫారాల్లోని కోళ్లకు ఈ వైరస్ సోకిందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రకటించారన్నారు. ఆయా ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు కోళ్ల రవాణా జరగకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నగరంలో కోడిమాంసం విక్రయించే వ్యాపారాలు సదరు ప్రాంతాల నుంచి కోళ్లను కొనుగోలు చేయవద్దని కోరారు. ప్రజలు కూడా కొన్ని రోజుల పాటు చికెన్ కొనుగోలు చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కోటిపల్లి బస్టాండ్ జంక్షన్ నుంచి రోడ్డు కం రైలు బ్రిడ్జికి వెళ్లే రహదారిని పరిశీలించారు. రాబోయే పుష్కరాలకు ఈ రోడ్డు చాలా కీలకంగా ఉంటుందన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ ఎ.వినూత్న, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

కడియం: కడియంలోని భ్రమరాంబికా సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ నెల 23వ తేదీ ఉదయం స్వామివారిని పెళ్లి కుమారుడిగా చేయడంతో మొదలై ఈ నెల 27న చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ మేరకు సోమవారం రాటపాటి ఉత్సవ ఏర్పాట్లను ప్రారంభించారు. ఆలయ అర్చకుడు అప్పలి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్, ఈవో వీర వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల వివరాలు సేకరించండి

పెదపూడి: జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారుల్లో అర్హులు, అనర్హులు తదితర వివరాలు ఈ నెల 20వ తేదీ లోపు సేకరించాలని అధికారులను తహసీల్దార్ పీవీ సీతాపతిరావు, ఎంపీడీవో కె.నరేందర్ రెడ్డి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయం, రెవెన్యూ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలు తీసుకున్న వారి అర్హతలు, రిజిస్ట్రేషన్ చేయించుకున్న, అమ్మకాలు చేసిన, ఒక ఇంట్లో రెండు స్థలాలు పొందిన, పేదవారిగా పేరు నమోదు చేయించుకుని ఇళ్లస్థలం పొంది విలాసవంతంగా ఇల్లు పెంచుకున్న, నాలుగు చక్రాల వాహనాలు ఉన్న , కరెంట్ బిల్లు ఎక్కువగా వచ్చిన వారి తదితర వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఈవో పీఆర్డీ డి. సత్యనారాయణ రెడ్డి, పంచాయతీ, రెవిన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్


సీతానగరం పోలీస్ స్టేషన్ వద్ద సీజ్ చేసిన లారీ

సీతానగరం: వంగలపూడి ర్యాంపు రీచ్–1 నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని సోమవారం డిస్ట్రిక్ట్ శాండ్ ట్రాస్క్‌ఫోర్స్ ఎస్సై ఎ.ప్రసాద్ సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ వంగలపూడిలో ఇసుక లారీని ఆపి తనిఖీ చేయగా, ఇసుక రవాణాకు సంబంధించి ఎటువంటి రికార్డులు, బిల్లులు లేవన్నారు. లారీలో ఇరవై టన్నుల ఇసుక ఉందన్నారు. దీంతో లారీని స్వాధీనం చేసుకుని, స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించామని, వారు మైన్స్ డిపార్టుమెంటుకు తెలియపర్చుతారన్నారు.

నేటి నుంచి పాశాలమ్మ జాతర

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామ దేవత పాశాలమ్మ జాతర మంగళవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకూ జరగనుంది. ఈ మేరకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి రెండు రోజులూ హోమాలు, అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహిస్తారు. చివరి రోజు అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ, అన్నసమారాధన జరుగుతాయి.

కందిపప్పు కొందరికే..

- పూర్తిస్థాయిలో జరగని పంపిణీ
- రేషన్ లబ్ధిదారుల అవస్థలు
- బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ.140

రాజమహేంద్రవరం రూరల్: అసలే నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కనీసం బియ్యంతో పాటు పౌరసరఫరాల శాఖ పంపిణీ చేయాల్సిన కందిపప్పును కూడా కంటితుడుపు చర్యగా అందజేస్తోంది. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో 1,53,000 రేషన్ కార్డులు ఉండగా కేవలం 24 వేల రేషన్ కార్డులకు మాత్రమే కందిపప్పును పంపిణీ చేశారు. కడియం మండలంతో పాటు రాజమహేంద్రవరం సిటీ ప్రాంతంలో ఒక్క రేషన్‌కార్డు దారుడికి కందిపప్పు పంపిణీ జరగలేదు. రూరల్ మండలంలో మాత్రమే 50 శాతం మందికి అందజేశారు.



కందిపప్పు కొందరికే..

రేషన్ కార్డుదారులందరికీ కందిపప్పును అందించాల్సి ఉండగా, కేవలం కొందరికే పంపిణీ చేసి చేతులు దులిపేసుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మార్కెట్‌లో కందిపప్పు ధర ఆకాశాన్ని అంటుతుంది. ఒక్కో ప్రాంతాన్ని బట్టి కిలో రూ.130 నుంచి రూ.140 వరకూ విక్రయిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తెల్లరేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ఎండీయూ వాహనాల్లో కందిపప్పును పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలో కందిపప్పు రూ.67 చొప్పున తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారుడికి అందించాలి. కానీ ముందుగా రేషన్ తీసుకున్న వారికి మాత్రమే కందిపప్పు అందుతుందని కార్డుదారులు చెబుతున్నారు. బియ్యం, పంచదారతో పాటు కందిపప్పును ఇస్తామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా హామీ ప్రకటించింది. కానీ అధికారంలోకి వచ్చాక అరకొరగా పంపిణీ చేస్తున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు.

పక్కదారి!

రేషన్‌లో ఇచ్చే కందిపప్పు పక్కదారి పడుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. కందిపప్పు కిలోకి కేవలం రూ.5 చొప్పున తక్కువ లాభాలు వస్తున్నాయని డీడీలు తీయడానికి ఎక్కువమంది రేషనుడీలర్లు వెనుకాడుతున్నారు. కొందరు డీడీలు తీసి పెట్టుబడులు పెట్టడం ఎందుకని డీడీలు తీయకుండా మిన్నకుండిపోతున్నారు. ఒకవేళ డీడీలు తీసినా కొందరు డీలర్లు మాత్రం హోటళ్లు, రెస్టారెంట్లు, మెస్‌లకు కందిపప్పును ఎక్కువ ధరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే పూర్తిస్థాయిలో కందిపప్పు వినియోగదారులకు చేరటం లేదన్న విమర్శలు వెలువెత్తున్నాయి.


ఎండీయూ వాహనం ద్వారా రేషన్ ఇస్తున్న దృశ్యం

పేదలపై చిన్నచూపు



తెల్లరేషన్ కార్డుదారులకు కందిపప్పును కూడా సరిగ్గా ఇవ్వకుండా ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. రాజమహేంద్రవరం సిటీలో ఒక్కరికి కూడా కందిపప్పు అందలేదు. లబ్ధిదారులందరికీ కందిపప్పు ప్రతినెలా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
– వల్లూరి శ్వేత, గృహిణి, మోరంపూడి

ముందుగా వెళితేనే..



బియ్యంతో పాటు ఇచ్చే కందిపప్పు అరకొరగా ఇస్తున్నారు. ముందు వచ్చిన వాళ్లకే అది కూడా ఉంటుంది. ఆ తర్వాత వచ్చే వాళ్లకు లేనట్లే. కార్డుదారులందరికీ కందిపప్పు ఇవ్వాలి. వచ్చే నెల నుంచి అయినా ప్రభుత్వం అందరికీ కందిపప్పు ఇచ్చే ఏర్పాటు చేయాలి.
– బత్తిన అప్పారావు, శాటిలైట్ సిటీ

'గోదావరి బాలోత్సవం' వాయిదా

ప్రకాశం నగర్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 23, 24వ తేదీల్లో జరగాల్సిన గోదావరి బాలోత్సవం (మూడో పిల్లల పండగ) కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్టు నిర్వాహకులు వీఎస్ఎస్ కృష్ణ కుమార్, పి.తులసి తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ మార్చి 8వ తేదీ వరకు కొనసాగుతోందన్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు, మిగిలిన తరగతుల పరీక్షలు జరుగుతాయన్నారు. అనంతరం వేసవి సెలవులు మొదలవుతాయన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభమైన తర్వాత జూలైలో గోదావరి బాలోత్సవాన్ని నిర్వహించాలన్న నిర్ణయానికి వచ్చామన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థుల పేర్ల మార్పులు, చేర్పులు చేసుకునేందుకు తేదీలు ప్రకటించాక, మళ్లీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెడతామన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గ్రహించాలని కోరారు.

పీఆర్సీ కమిషన్ నియమించాలని తీర్మానం



ఏపీటీఎఫ్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

కంబాలచెరువు: పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. స్థానిక నెహ్రూ నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం ఏపీటీఎఫ్ సమావేశం జరిగింది. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (ఏఐఎఫ్ఈఏ) చీఫ్ పాట్రన్ కె.సుబ్బారెడ్డి, ఉపాధ్యాయ ప్రగతి ఎడిటోరియల్ సభ్యుడు ఏఎస్ నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. వాటిలో ప్రధానంగా పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, కమిషన్ రిపోర్టు ఇచ్చేలోపు మధ్యంతర 30 శాతం భృతిని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ తదితర బకాయిలను వెంటనే విడుదల చేయాలని, మోడల్ ప్రైమరీ పాఠశాలల నెపంతో విద్యార్థుల తరలింపును, పాఠశాలల కుదింపును నిలుపుదల చేయాలన్నారు. ఉత్తరాంధ్ర శాసన మండలి పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడుకు మద్దతు తెలుపుతూ తీర్మానం చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయ బ్రహ్మం, జిల్లా అధ్యక్షుడు కె.డేవిడ్ లివింగ్‌స్టన్, జిల్లా గౌరవాధ్యక్షులు వి.అప్పయ్య శాస్త్రి, ఉపాధ్యక్షులు వైవీ రామారావు, అదనపు కార్యదర్శి ఎస్.రామారావు పాల్గొన్నారు.

'పరీక్షా పే చర్చ'తో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

కంబాలచెరువు: విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు పరీక్షా పే చర్చా కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (డీఐ) బి.దిలీప్ కుమార్ అన్నారు. పరీక్షలనే భయాన్ని పోగొట్టేందుకు ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. స్థానిక గాంధీపురం–2లోని సుంకర భాస్కరరావు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి ఆయన వీక్షించారు. యూట్యూబ్ ద్వారా ప్రసారమైన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేరుగా మాట్లాడి, పరీక్షల సమయంలో ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళనలను అధిగమించేందుకు చిట్కాలు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.సన్యాసిరావు, ఉపాధ్యాయులు తదితరులు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు.

హక్కులతో పాటు బాధ్యతలను గుర్తెరగాలి


వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవరావును సత్కరిస్తున్న సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగులు తమ హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన రాజమహేంద్రవరం అర్బన్ విస్తరణ అధికారి వేణుమాధవరావును సోమవారం ఘనంగా సన్మానించారు. హుకుంపేట ఏడీఏ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, రాజమహేంద్రవరం సబ్ డివిజన్‌కు చెందిన వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, వీఏఏ, వీహెచ్ఏలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ వేణుమాధవరావుకు ఏఈఓ సంఘంతో పాటు వ్యవసాయశాఖలోని ఉద్యోగులందరి సమస్యలపై అవగాహన ఉందన్నారు. రాజమహేంద్రవరం ఏడీఏ శ్రీనివాస్ రెడ్డి, నగర ఎన్జీవో సంఘ ఉపాధ్యక్షులు మీసాల మాధవరావు, వ్యవసాయ అధికారులు భీమరాజు, శాంతా ఆలివ్, ద్వారకాదేవి, సరళ, కాసిం, జిల్లా ఏఈఓ సంఘం కోశాధికారి నాగేశ్వరరావు, వీఏఏ సంఘం జిల్లా అధ్యక్షులు దుర్గబాబు తదితరులు ప్రసంగించారు.

ఇళ్ల స్థలాల ప్రక్రియ వెంటనే చేపట్టాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకుడు తాటిపాక మధు తదితరులు

ప్రకాశం నగర్: ఇల్లు లేని పేదలకు నగరాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం ఇస్తామని కేబినెట్‌లో ప్రకటించారని, దాని ప్రకారం వెంటనే ఇళ్ల స్థలాల ప్రక్రియ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఇల్లు లేని పేదలు, సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంతకు ముందు సబ్ కలెక్టర్‌కు 1,550 అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాలు కేటాయించి, హామీని నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఆచరణలో స్థలాల కేటాయింపులు చేయాలని, పెరిగిన భవన నిర్మాణ సామగ్రి ధరలకు అనుగుణంగా రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు సహాయ కార్యదర్శి సప్ప రమణ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై అంధకారం


లాలాచెరువు వద్ద వెలగని వీధి దీపాలు

రాజానగరం: జాతీయ రహదారి డివైడర్లపై ఏర్పాటు చేసిన వీధి దీపాలు కొన్నిచోట్ల వాటి ఉనికినే కోల్పోతున్నాయి. రాత్రి సమయాలలో ప్రమాదాల నియంత్రణకు వీటిని ఏర్పాటు చేశారు. ఆ విషయాన్ని సంబంధిత విస్మరిస్తున్నారో లేక నిర్లక్ష్యం చూపుతున్నారో తెలియదు గానీ లాలాచెరువు, రాజానగరం వంటి జన సాంద్రత అధికంగా ఉండే ప్రాంతాలలో రాత్రి వేళల్లో ఇవి వెలుగడం లేదు. రాజమహేంద్రవరానికి చేరువలో ఉన్న లాలాచెరువు హౌసింగ్ బోర్డు ప్రాంతంలో జాతీయ రహదారిపై ఈ వీధి దీపాలు ఎప్పుడూ వెలగడం లేదని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. రాజానగరం – ఏడీబీ రోడ్డు కూడలిలో కూడా ఆదే పరిస్థితి నెలకొంది.

నెల రోజుల్లో అన్ని కమిటీల ఏర్పాటు



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: కాంగ్రెస్‌లోని అన్ని కమిటీలను నెల రోజుల్లో ఏర్పాటు చేస్తామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు బూత్, డివిజన్, మండలం, టౌన్, సిటీ కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సంఘటిత, అసంఘటిత కార్మిక (కేకేసీ) జిల్లా ఇన్‌చార్జిగా నగరానికి చెందిన దొంతుమళ్ల రామ్‌కుమార్‌ను నియమించామన్నారు. ఆయన క్వారీ లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడిగా కూడా ఉన్నారన్నారు. ఇకపై ఐఎన్‌టీయూసీ ఉండదని, ఆ స్థానంలో కేకేసీ నూతన కార్మిక సంఘం ఉంటుందని స్పష్టం చేశారు. ఐఎన్‌టీయూసీలోని సంఘటిత, అసంఘటిత సంఘాలన్నీ ఇకపై కేకేసీ పరిధిలోకి వస్తాయని తెలిపారు. సమావేశంలో పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోత శారద, వడయార్, శ్రీనివాస్ వడయార్, పట్నాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామభక్తులకు అల్పాహారం పంపిణీ


రామభక్తులకు అల్పాహారం అందిస్తున్న దాతలు

రాజానగరం: లోక కల్యాణార్థం సామర్లకోట నుంచి భద్రాచలానికి చేపట్టిన దివ్య రథోత్సవ పాదయాత్ర సోమవారం ఉదయం దివాన్ చెరువుకు చేరుకుంది. ఆంజనేయస్వామి మాల దీక్షలో ఉన్న 203 మంది సీతారామాంజనేయ భక్తులు 'శ్రీరామ సంకీర్తనలు' ఆలపిస్తూ ఈ యాత్ర చేస్తున్నారు. ఈ విధంగా తమ గ్రామం చేరుకున్న వారిని ఆర్య వైశ్య సంఘ నాయకులు గ్రంధి నానబ్బులు సంఘ సభ్యులు, కుటుంబ సభ్యులతో కలసి స్వాగతం పలికి, అల్పాహార విందును ఏర్పాటు చేశారు. సామర్లకోట సమీపంలోని అచ్చంపేట వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి శనివారం బయలు దేరిన ఈ పాదయాత్ర రాజమహేంద్రవరం, కొయ్యలగూడెం, అశ్వారావుపేట, ఊలపల్లి, వేలేరు, భూర్గుంపహాడ్‌ల మీదుగా 16 రాత్రికి భద్రాచలం చేరుకుంటుందని వాసుదేవ గురుస్వామి తెలిపారు. ఈ విధంగా గత 14 సంవత్సరాలుగా పాదయాత్ర చేస్తున్నామన్నారు. దారిలో ప్రతిచోట ఆలయాల వద్దనే ఆగి, దాతల సహకారంతో అల్పాహారం, భోజనాలు చేస్తూ, యాత్రను కొనసాగిస్తున్నామన్నారు.

చంద్రశేఖరస్వామికి పూజలు

రంగంపేట: చంద్రేడు గ్రామంలో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి దేవాలయంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం స్వామిని సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సింహవాహనంపై వేంకటేశ్వరుడు

కడియం: దుళ్లలో జరుగుతున్న శ్రీ భూసమేత వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా కాల్పుల మధ్య వైభవంగా స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు స్వామి వారికి అన్నకూటోత్సవం జరిపించారు. నిత్య పూజలు, ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.


సింహ వాహనంపై దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి

అంగరంగ వైభవంగా వీరభద్రుడి సంబరం

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో వీరభద్రుడి సంబరాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గుల్లిపల్లి, కర్రి, యాసలపు, కొటాని, లగుడు వంశీయులు కలిసికట్టుగా 40 ఏళ్ల క్రితం ఈ సంబరం నిర్వహించారు. అప్పటి నుంచి మరలా ఎవరి వారి తీరు అన్న విధంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో దాదాపు 40 ఏళ్ల తర్వాత వీరంతా కలిసి ఎంతో ఘనంగా ఈ వేడుక జరిపారు. ముందుగా వీరభద్రుడు గద్దె వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సంబరంలో తీన్మార్ డప్పులు, సన్నాయి మేళాలు, కేరళ వాయిద్యాలు, శక్తి వేషధారణలు ఆకట్టుకున్నాయి. శివాలయం జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు అనంతరం మళ్లీ గ్రామోత్సవంతో గద్దె వద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు.


పందలపాకలో గద్దె వద్ద వీరభద్రుడికి పూజ చేస్తున్న భక్తులు

ఆల్బెండజోల్ మాత్రలతో రక్తహీనత నివారణ



విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న దృశ్యం


విద్యార్థులకు మాత్రలపై అవగాహన కల్పిస్తున్న ఏఎన్ఎం సలోమి

సీటీఆర్ఐ: అల్బెండజోల్ మాత్రలతో చిన్నారులలో రక్తహీనత, పోషకాల లోపాన్ని నివారించవచ్చని అంబేడ్కర్ నగర్ యూపీహెచ్‌సీ డాక్టర్ బొట్టేటి అశోక్ కుమార్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం డీఎంహెచ్ స్కూల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న, ఇతర మందులు వాడుతున్న పిల్లలకు వీటిని ఇవ్వకూడదన్నారు. ఈ మాత్రలు మింగిన పిల్లల్లో కొందరికి వికారం, వాంతులు, విరేచనాలు, నీరసం వస్తాయని, అవన్నీ తాత్కాలికమేనన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శర్మ, డీపీహెచ్ఎంఓ వసంతలక్ష్మి, హెచ్‌వీఎంఎస్ఎస్ కుమారి, ఏఎన్ఎం భవాని, పీకే రత్నం, ఆశా వర్కర్ల పద్మ, రమ్య, దుర్గ తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సిబ్బంది

రక్తహీనత నివారణ

రాజమహేంద్రవరం అర్బన్‌లోని అన్ని పాఠశాలల్లోనూ నులి పురుగు నివారణకు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేసినట్టు అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక చున్నీలాల్ జాజూ మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో డీవార్మింగ్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నులిపురుగుల వలన రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించటం, నీరసం, ఆందోళన, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఆల్బెండజోల్ మాత్ర వేయడం ద్వారా వాటిని నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సీతామహాలక్ష్మి, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం పాల్గొన్నారు.

- బడికి వెళ్లే విద్యార్థుల్లో కనిపించే రక్తహీనత, పోషకాల లోపానికి నులి పురుగులే కారణమని ఏఎన్ఎం సలోమి అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. విద్యార్థులు గోళ్లను చిన్నవిగా శుభ్రంగా ఉంచుకోవాలని, ఎప్పుడూ శుభ్రమైన నీటిని తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయరాదని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, ఆర్ఎస్ఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	:	సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ	:	బడాస్ రవికుమార్
సూర్యప్యాలెస్	:	పట్టుదల
స్వామి	:	సంక్రాంతికి వస్తున్నాం
శివజ్యోతి	:	తండేల్
అనుశ్రీ	:	ఒక పథకం ప్రకారం, మదగజరాజ
రాజా	:	తండేల్
ఊర్వశి	:	డాకు మహారాజ్
మేనక	:	గేమ్‌ఛేంజర్
రంభ	:	ఒక పథకం ప్రకారం, మార్కో
కుమారి	:	తండేల్
అప్సర	:	తండేల్
అశోక	:	పట్టుదల
నామవరం		
వీఎస్.మహల్ ధవళేశ్వరం	:	తండేల్
మురళీకృష్ణ కడియం	:	తండేల్
వెంకటసూర్య	:	తండేల్